# మహజరు

దేశాన్ని ప్రేమించు అని సూక్తి రాసి సులువుగా బడి గోడకు మేకువేసి కొట్టేస్తాం. అన్నిటి కంటె కష్టమైన పని దేశాన్ని ప్రేమించడమే. నా కేమీ అక్కర లేదు. దేశం బాగుంటే అందులో భాగమైన నేనూ బాగుంటాననుకోవడం అలా నడుచుకోవడం దేశాభిమానం. ఊరికే ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడం ప్రయోజనం లేని పని ప్రజా స్వామ్యంలో. ప్రజలు ఏ ప్రభుత్వానికి అర్హులో అదే వారికి సంక్రమిస్తుందని ఓ సూక్తి ఉండనే వుంది.

ఇదంతా ఎందుకు చెబుతున్నా నంటారా? ఇది కేవలం నా కట్టుకథ కాదు కాబట్టి. చరిత్రలో ఓ భాగం కాబట్టి. నేను ఆమె బిడ్డను కాను. కాని అసలు ఆమెకు బిడ్డలే లేరు. ఆ ప్రాంతంలోని మనుషులందరూ ఆమె బిడ్డలే. ఆమె అలాగే అనుకుంటుంది.

ఆమె మహా సంపన్నురాలు. అంటే ధనవంతురాలనుకుంటే మీరు తొందరపడినట్టే.

నా తండ్రి పోయేసరికి నేను పదేళ్ళ వాడిని. మా అమ్మ దగ్గర నాకు భయం ఉండేది కాదు. పక్క ఇంట్లోనే వుండేది నన్ను పెంచిన తల్లి సుబ్బమ్మ.

సుబ్బమ్మ భర్త నాకు తెలియనే తెలియదు. నలభై ఆరులో యాభై ఎనిమిదవ ఏట ఆయన పోయినట్టు చెప్పుకొంటూ ఉంటారు.

అసలు నేను భూమిమీద పడడానికి దోహదం చేసిన మనిషే సుబ్బమ్మట!

నాకు బాగా గుర్తు. గోలీకాయ లాటలో పడమటి పొలం రైతు కొడుకుని రాయేసి కొట్టాను. రక్తం వరదైంది. మా అమ్మ నన్ను చితకబాదుతూ ఉంటే సుబ్బమ్మ నన్ను కొడుతున్న దెబ్బలు ఓ నాలుగు తిని, నన్ను కొంగులో దాచుకొని వాళ్ళింటికి తీసుకుపోయింది.

నాకు అక్షరాలు దిద్దడం నేర్పింది సుబ్బమ్మ. అమ్మ దగ్గర ఆకతాయి నయిన నేను సుబ్బమ్మ నీడన అక్షరాస్యుడ నయ్యాను.

నేను పట్నం వెళ్ళి చదువుకోవడమూ సుబ్బమ్మ చలవే. కోసెడు దూరం హైస్కూలూ, పది ఆమడల దూరంలో కాలేజీ - రెండూ నాకు చదువు చెప్పాయి. నా చదువు వెనక ప్రణాళికా రచనంటూ వుంటే అది సుబ్బమ్మదే.

సుబ్బమ్మ భర్త స్వాతంత్ర్య సమరయోధుడు. గాంధీగారు గుజరాత్‌లో గర్జిస్తున్న తరుణంలో మా ఊరిలో ఆయన కేకను ప్రజలకు అందించిన బడిపంతులు సోమయ్యమామ మా ఊరందరికీ మామయ్యేనట.

ప్రకాశంపంతులు మా ఊరు వచ్చినప్పుడు సుబ్బమ్మే అతనికి ఆతిథ్యం ఇచ్చిందట. కారణం సోమయ్యమామా, ప్రకాశం పంతులుగారూ ఒకేసారి గాంధీగారి శిష్యులుగా సబర్మతీలో ఉండడమేనట.

మామయ్య దేశం కోసం పాట్లు పడుతూ వుంటే, సుబ్బమ్మ భూమి పనులు చూసుకునేదట! గాంధీతాత దగ్గరికి సుబ్బమ్మ రెండు సార్లు వెళ్ళిందట.

ప్రకాశంపంతుల్నీ, నెహ్రూగారినీ, గిరిగారినీ, పటేల్‌నీ, పట్టాభినీ పేరు పేరునా ఎరుగునట సుబ్బమ్మ. వాళ్ళెవరు ఆ ప్రాంతంలోకి వచ్చినా సుబ్బమ్మను చూడకుండా వెళ్ళలేదట. ఆమె చేతి వంట-ఆమె అప్యాయతనూ రుచి చూడని స్వాతంత్ర్య యోధులు లేరని ఈ నాటికీ మా ఊరి ప్రజలు చెప్పుకుంటూ వుంటారు.

ఊరంతటికీ సుబ్బమ్మంటే ప్రాణం. అర్ధరాత్రి, అపరాత్రి, ఎవరెక్కడ పురుడయినా, పది మైళ్ళ కైవారంలో ఏ సందడయినా సుబ్బమ్మ అక్కడే వుండేదట.

నాకు ఉద్యోగం వచ్చిందంటే బోలెడు సంబర పడిపోయింది సుబ్బమ్మ. బడిపంతులు ఉద్యోగం నిజంగా దేవుడిచ్చిన వరం అంది. మా గ్రామానికి పాతిక మైళ్ళ దూరంలో వున్న స్కూల్లో ఉద్యోగ మిచ్చారు నాకు.

అమ్మ నాతో రాననేసింది.

"నువ్వెక్కడున్నా సుఖంగా, నలుగురికీ పనికొచ్చేటట్టుగా వుండడమే నాకు కావల్సింది. నాకూ ఈ ఊరికీ ఓ సంబంధం ఉంది. నే లేకపోతే ఈ ఊరు ఈ ఊరు లేకపోతే నేనూ ఉండలేము" అని చెప్పి, ఊరు వదలి నాతో రాలేననేసింది సుబ్బమ్మ కూడా.

నేను ఉద్యోగానికి వెళ్ళినా అవకాశం దొరికినప్పుడల్లా సుబ్బమ్మను చూడడానికి వస్తూండే వాడిని.

ఊళ్ళోకి వచ్చిన రాజకీయ నాయకులెవరూ సుబ్బమ్మను చూడకుండా వెళ్ళరు. వాళ్ళొచ్చి పలకరిస్తే ఆవిడకి బోల్డు సంబరం.

"మొన్న...అంటే ఈ మధ్య గిరి గారి కొడుకు వచ్చాడట. నా కయితే గిరిగారినే తెలుసుననుకో...అప్పటికీ భోజనం చేసి వెళ్ళమన్నా ఆయన ఉండలేదనుకో..."అని సుబ్బమ్మ చెబుతూ ఉంటే నాకు కళ్ళ వెంబడి నీళ్ళొచ్చాయి.

ఈ ప్రపంచంలో ఎవరి గొడవ వాళ్ళది. అంత తీరికగా ఈ ముసలావిడ పెట్టే మెతుకుల కోసం ఎవరు మాత్రం అక్కడ వుంటారు.

నాకు నేనే ఊపిరి పీల్చుకోడానికి తీరిక లేనంత హంగామా పెంచేసుకొన్నాను.

సుబ్బమ్మకి కనుచూపు తగ్గిపోయింది. పొలం వెళ్ళడానికిక ఓపిక లేకుండా పోయింది. పొలం కౌలు కిచ్చి గుమ్మం దిగకుండా కాలక్షేపం చేసుకొస్తోంది.

"శంకరం! రా నాయనా! ఎప్పుడొచ్చావ్?" అంది నా గొంతు వాకిట్లో వినబడగానే.

మంచం మీదే వుంది సుబ్బమ్మ. నేను రోజూ చూస్తున్నట్లే వున్న సుబ్బమ్మ, ఒక్క పదిహేను రోజుల్లో ఎలా అయిపోయింది!

"కబురు చెయ్యక పోయావా? ఏమిటిలా అయిపోయావ్? ఏమైనా సుస్తీ చేసిందా?"

"బ్రతుకే సుస్తీగా వుంది నాయనా...నా మాట కేంలే! మరి కోడలి నెప్పుడు తెస్తున్నావ్?"

అమ్మ ఇలా అడిగించిందని నా అనుమానం. ఆ మాట మార్చి నాతో పట్నం రమ్మన్నాను. డాక్టరుకు చూపిస్తానన్నాను.

"ఈ వయసులో ఇక వైద్యం ఎందుకు నాయనా! ఆ ఘడియ కోసం చూస్తున్నా!" నా గుండె

చెరువై పోయింది.

అతి దగ్గరలో వున్న డాక్టరును బ్రతిమాలి తీసుకొచ్చాను. మందులు రాసిచ్చాడు. గుండె నీరసంగా ఉందన్నాడు.

నేను బయలు దేరుతుంటే తలగడ క్రింద నుంచి తీసి వంద కాగితం ఇచ్చింది.

"మళ్ళీ మరో చెక్క అమ్మేశావా, సుబ్బమ్మా?" అని అడిగాను.

"నా కెందుకు నాయనా మళ్ళూ, చెక్కలూ...మీ అభిమానం వున్నంత వరకూ నాకిక ఆకలీ దప్పికా ఉండవ్!"

ప్రపంచం సంగతి నాకు తెలుస్తోంది. దిక్కూ మొక్కూ లేని ఈ ముదుసలి నెవరు చూస్తారు?

ఆ తరువాత అమ్మ చెప్పింది. పొలం సుబ్బమ్మ పూర్తిగా అమ్మేసిందని...ఇల్లుచూస్తే వానకి జల్లెడలా కారిపోతుందట. పెణక జారిపోడానికి సిద్ధంగా వుంది.

క్రమం తప్పకుండా మందులందిస్తూ వచ్చాను. నాలుగు రోజుల్లో కొంచెం కుదుట పడినట్లనిపించింది. బయలుదేరే ముందు అమ్మతో చెప్పాను-సుబ్బమ్మను నాతో తీసుకెళ్ళి తీరుతానని. ఇద్దరం నేనూ అమ్మా! ఆమెకు శత విధాల చెప్పాం. చిరునగవుతో వింది సుబ్బమ్మ. "నాకు రావాలనిపించినప్పుడు వచ్చేస్తా...ఇప్పుడు కొంచెం నిమ్మళంగానే వుందికదా!" అంది నా తల నిమురుతూ. తెల్లవారుఝామున నేను పట్నం బయలుదేరాల్సి ఉంది. రాత్రి మళ్ళీ సుబ్బమ్మ దగ్గర విషయం కదిల్చాను.

"చిన్నపాలెం రైతు వచ్చాడ్రా...రేపు ఉదయం మునసబు లోగిలికి మంత్రిగా రొస్తున్నారట! నాకు నవ్వు వస్తోంది. ఆ మంత్రి, నా చేతిలోనే పుట్టాడు.'సుబ్బమ్మా! వేరుసెనగ కాయలియ్యవా?' అంటూ వచ్చేవాడు, నీకు తెలీదులే, వాళ్ళ నాన్న ఈ ఊరిలోనే ఉండేవాడు. తరువాత పట్నాలంట వెళ్ళిపోయారనుకో! మీ అమ్మ నడుగుదూ...సుబ్బిగాడంటే, మీ అమ్మకీ గుర్తొస్తుంది."

నాకు మతిపోయింది.

మంత్రి సుబ్బారాయుడు ఇటు రాష్ట్రంలోకీ. అటు కేంద్రంలోకీ పలుకుబడి గడించిన సుబ్బారాయుడు నాలాగే సుబ్బమ్మ కొడుకా?

"అయితే సుబ్బమ్మా! నిన్ను చూడడానికి వస్తాడేమో!"

"రాకూడదురా! ఆ హోదా వేరు! వాళ్ళ దగ్గరకు మనం వెళ్ళడమే న్యాయం. వాళ్ళు మన దగ్గరకు రాకూడదు!"

ఆమె ఎంత నిగర్వి! ఎంత నిరాడంబర జీవి! ఎంత మమత తెలిసిన మనిషి! ఆమె ముఖం నిండా ఆనందమే.

"అయితే సుబ్బమ్మా నేనో పని చేస్తా, లేదా నీచేత చేయిస్తా. నువ్ కాదనకూడదు. కాదు కూడదంటే వీల్లేదు" అంటే గబగబా బయటకు వెళ్లాను.

మర్యాద సూచకంగా రెండున్నరంగుళాలు పక్కకి మడత పెట్టి తావు కాగితం మీద చకచకా రాసేశాను. మరోసారి చదువుకున్నాను. చెప్పాల్సింది చురుకుగా క్లుప్తంగా, సూటిగా చెప్పాలనిపించింది. కాగితం నలిగిపోకుండా సుబ్బమ్మ దగ్గరకు తీసుకెళ్ళాను. సంతకం చెయ్యమన్నాను. నా సంతకానికిక

విలువేముందిరా అంది. నాకు ఏడుపొచ్చింది. అయినా ఏమిటని అడగకుండా సంతకం చేసి కాగితం నాకిచ్చేసింది.

అయినా నేను చెప్పనూ చెప్పాను, గర్వంతో, ఆనందంతో నా మనసు ఉరకలేసింది.

సెలవు చీటీ బస్సుకి ఇచ్చేశాను. మంత్రిగారు వచ్చేవేళకి బయటకు రావచ్చని మునసబు లోగిలి పక్కనున్న పాకలో సుబ్బమ్మను ఉంచాను.

జీపు పందిరి ముందర వరకూ వచ్చేసింది.

జీపు రావడమేమిటీ-మంత్రిగారిని చుట్టు ముట్టేశారు గ్రామంలోని మనుషులు. జీపుదిగగానే ఆయన్ను లోగిల్లోకి తీసుకుపోయారు.

ఓ అరగంట తరువాత నేను ధైర్యం చేసి లోపలకు వెళ్ళి, "మునసబుగారూ! సుబ్బమ్మ మన మంత్రి గారిని చూడాలని వచ్చింది" అన్నాను.

"సుబ్బమ్మా..." మంత్రిగారు లేచి, "ఏరీ? ఏరీ?"అంటూ తనే బయటకు వచ్చారు.

"వద్దు బాబూ! తమరు రావద్దు. తమంతటి అధికారులు ఆమె దగ్గరకు రాకూడదట. ఆమే వస్తానంది. పక్క గుడిసెలో ఉంది సెలవైతే." "క్షమించండి మునసబుగారూ!" అంటూ సుబ్బారాయుడుగారు గబగబా నా భుజం మీద చెయ్యివేసి నడిపించారు నన్ను.

"ఎక్కడుంది సుబ్బమ్మ తల్లి?" అంటూ ద్వారం దగ్గర గుమి గూడి ఉన్న అందరూ దిక్కులు చూస్తున్నారు. మా ఇద్దరికీ తోవ ఇచ్చేశారు.

గుడిసె బయటే నుంచుని ఉంది సుబ్బమ్మ.

"సుబ్బమ్మ తల్లీ? నీ బిడ్డనమ్మా నేను. నీ చలవే." అంటూ సుబ్బారాయుడు గారు ఆమెకు పాదాభివందనం చేశారు.

చుట్టూ జనాలు మూగిపోయారు.

"బాబూ! ఆమె మీకు రాసుకున్న మహజరు!" అంటూ నేను కాగితం చుట్ట ఆయనకు అందించాను.

"మహజరా! సుబ్బమ్మ మాకు మహజరు పెట్టుకోవాలా! ఏమమ్మా! నీలాంటి వీరవనితలూ. దేశమాతలూ లేకపోతే ఈ రోజు ఈ దేశం ఇలా ఉండేదా?...నన్ను ఆశీర్వదించు తల్లీ!"

సుబ్బమ్మ ఆయన్ను కౌగలించుకుంది తల నిమిరింది. మంత్రిగారి కళ్ళనుంచి ఆనంద బాష్పాలు. సుబ్బమ్మ అరమోడ్పు కళ్ళు.

ఫోటోగ్రాఫర్ల కెమేరాల నుంచి వెయ్యి మెరుపు తీగలు. పట్టపగలు కళ్ళు మిరుమిట్లు.

మంత్రిగారు వెళ్ళిపోయారు.

"సుబ్బమ్మా! నువు ధన్యురాలివి. నేను నీచేత సంతకం చేయించినది నీకు వృద్ధాప్యం పింఛనీ మంజూరు చెయ్యమన్న మహజరు. స్వతంత్రం కోసం పోరాడిన నీలాంటి సామాన్య ప్రజానీకంలో ప్రతిమనిషీ ఓ వీరమాత...ఓ దేశమాత! నీ త్యాగం అపూర్వం...

"ప్రభుత్వం నీకిక ఏలోటులేకుండా చూస్తుంది. పువ్వుల్లో పెట్టి పూజించుకుంటుంది."

నేను ఉద్వేగంగా చెబుతున్నాను గుడిసెలో ఉన్న సుబ్బమ్మతో.

మంత్రిగారు వెళ్ళిన సంగతి నేను చూడలేదు. ఆమెను ఇంటికి తీసుకొచ్చేశాను.

మహజరు మంత్రిగారికే నేరుగా ఇచ్చాం. కనుక ఓ వారం రోజుల్లో సుబ్బమ్మకి పింఛినీ మంజూరయి రావచ్చు

"సుబ్బమ్మా! ఇక నీకు సందేహం అక్కరలేదు. పట్నంలో పోనీ నీ డబ్బుతోనే నువు నా దగ్గర ఉండవచ్చు. నాతో వచ్చెయ్!" అని మళ్ళీ బ్రతిమలాడడం ప్రారంభించాను. నాకు ముందు రోజు చెప్పిన సమాధానమే చెప్పింది.

సుబ్బమ్మను ఇంటికి దిగబెట్టి ఓ గంట తరువాత మళ్ళీ మునసబు లోగిలికి వెళ్ళాను. గ్రామంలో పెద్దలింకా గుంపు గుంపులుగా అక్కడే నుంచున్నారు. సుబ్బారాయుడుగారి మంచితనం గురించీ ఆయన సుబ్బమ్మ ఎడల చూపించిన మాతృభక్తి గురించీ చెప్పుకుంటున్నారు.

మునసబు నన్ను మర్యాద చేశాడు. కుర్చీలో కూచుని ముందున్న బల్ల మీదనున్న పేపరు తీశాను. కాగితం క్రింద పడింది. ఏమిటో అని తీసి చూశాను. నే రాసిన అర్జీ, "ఇది యిక్కడి కెలా వచ్చింది?" మునసబు నడిగాను.

"ఏటయ్యా అది? సదివి సెప్పు!" అంటున్నాడతను.

నేను లేచి బయటకు వస్తుంటే "కాఫీ తాగి వెళ్దువు సిన్నయ్యా!" అంటున్నాడు మునసబు.

సుబ్బమ్మ ఏనాడూ చెయ్యాలని అనుకోని పనిని ఆమెచేత చేయించాను. నాకంటె మనుషుల మనస్తత్వాల విషయం ఆమెకు లోతుగా తెలుసునని నాకు ఇప్పుడు తెలిసింది.

మమతలూ మానవత్వమూ తెలియని మనుషులను మహజర్లు కరిగించలేవని ముందే తెలిసిన సుబ్బమ్మకు నా మొహం ఎలా చూపించను?

ఆమెను చూడకుండా ఊరు ఎలా వదలను?

ఆమె గుండెలు బద్దలు చెయ్యడం కంటే ఆమెను మోసం చెయ్యడమే నయం. ప్రభుత్వం ఇస్తున్నట్టుగా ఆమెకు నెలానెలా ఓ వంద రూపాయలు ఇవ్వమని ఆ డబ్బు నేనతనికి ముందుగా పంపిస్తాననీ పోస్టు మాస్టరుకు ముఖాముఖి మహజరు నివేదించుకోడానికిక అతన్ని వెదుక్కుంటూ బయలుదేరాను.

విజయ నవంబరు 1983